క్లుప్తంగా

సూక్ష్మ సేద్యానికి ప్రభుత్వ ప్రోత్సాహం



చాటాయివలసలో పరిశీలనలు జరుపుతున్న పీడీ లక్ష్మీనారాయణ

రేగిడి : సూక్ష్మ సేద్యానికి ప్రభుత్వం ఎంతో ప్రోత్సహిస్తుందని జిల్లా ఏపీఎంఐపీ పీడీ లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని వన్నలి, చాటాయివలస గ్రామాల్లో సూక్ష్మ సేద్యం నిమిత్తం ప్రభుత్వం అందించిన స్ప్రింక్లర్ పైపులు వినియోగాన్ని గురువారం పరిశీలించారు. 50 శాతం రాయితీతో అందిస్తున్న పైపులు వినియోగంపై ఆరా తీశారు. వీటిని చక్కగా వినియోగించుకోవాలని సూచించారు. ఎంతమంది రైతులకు కావాలన్నా వీటిని ఇస్తామని, ఆర్‌బీకేలు ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ కెంబూరు శ్రీనివాసరావు, సర్పంచ్‌లు గార రమణ, కరణం గోవిందరావు, ఏపీఎంఐపీ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటిని వృథా చేయొద్దు



బొడ్డవలసలో కుళాయిలను పరిశీలిస్తున్న ఏఈ

రేగిడి: గ్రామాల్లో కుళాయిల ద్వారా వస్తున్న తాగునీటిని ప్రజలు వృథా చేయొద్దని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జి.శ్రీచరణ్ కోరారు. మండలంలోని చిన్నయ్యపేట, సంకిలి, బొడ్డవలస తదితర గ్రామాల్లో తాగునీటి కుళాయిలను గురువారం పరిశీలించారు. వేసవిలో అన్ని గ్రామాలకు తాగునీరు అందే విధంగా చర్యలు చేపడుతున్నామని, ఇందుకు ప్రజలు కూడా సహకరించాలన్నారు. కుళాయిల వద్ద బట్టలు తడపడం, ఇంటి నిర్మాణాలకు పైపుల ద్వారా నీటిని పెట్టడం వంటివి చేయకూడదని మహిళలకు సూచించారు.

పిచికారీ చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి

రేగిడి : ఖరీఫ్‌లో రైతులు సాగు చేస్తున్న వరి పంటలకు తెగుళ్లు ఆశించినప్పుడు రైతులు పురుగు మందులు పిచికారీ చేసిన సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలో చాటాయివలస గ్రామంలో వైఎస్ఆర్ పొలంబడి కార్యక్రమంలో భాగంగా రైతులకు పురుగు మందుల పిచికారీపై గురువారం అవగాహన కల్పించారు. ప్రధానంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో రసాయనాలు తయారీ చేసి వినియోగిస్తే పురుగు మందులు ఎక్కువగా వినియోగించాల్సిన అవసరం ఉండదని అన్నారు. రైతులు వ్యవసాయ సాగుపై నూతన పద్ధతులు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం గోవిందరావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ కెంబూరు శ్రీనివాసరావు, ఐసీఆర్‌పీ తవిటినాయుడు, రైతు మిత్ర ఇ.రాము పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

రాజాం : రాజాంలో జీఎంఆర్ వీఎఫ్ నిర్వహిస్తున్న ఉచిత స్వయం ఉపాధి శిక్షణలో భాగంగా అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ శిక్షణకు దరఖాస్తులు కోరుతున్నట్టు ఆ సంస్థ ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నాబార్డు సహకారంతో జీఎంఆర్ వీఎఫ్ ఈ శిక్షణ నిర్వహిస్తుందని, 50 రోజుల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. పది, ఐటీఐతో పాటు ఆపై చదువులు చదివిన యువతీ యువకులు అర్హులని వెల్లడించారు. ఈ నెల 30న నేరుగా జీఎంఆర్ నగర్‌లో సీఎస్‌డబ్ల్యూ బిల్డింగ్‌లో జీఎంఆర్ వీఎఫ్ నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు. శిక్షణకు ఎంపికైన అభ్యర్థులకు ఉచిత భోజన, వసతి సదుపాయాలు ఉంటాయని పేర్కొన్నారు. వివరాలకు 81868 84244, 99890 57451 నంబర్లను సంప్రదించాలని కోరారు.

చిన్నారులకు ఆంగ్ల పదాలపై అవగాహన

రేగిడి : అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆంగ్ల పదాలపై అవగాహన కల్పించేందుకు కార్యకర్తలు చర్యలు చేపట్టారు. పలు రకాల బొమ్మలు వేసి వాటి పేర్లను ఇంగ్లిష్‌లో నేర్పిస్తున్నారు. చిన్నారులకు అర్థమయ్యేలా వినూత్న పద్ధతిలో బోధన చేస్తున్నారు.

ఈ క్రాప్ నమోదుతో ప్రయోజనాలు

రాజాం : ఈ క్రాప్ నమోదుతో రైతులకు ఎంతో ప్రయోజనం ఉందని వైఎస్సార్‌సీపీ రాజాం రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు అన్నారు. గురువారం గ్రామ సచివాలయం వద్ద రైతులకు అవగాహన కల్పించారు. ఈ క్రాప్ నమోదు చేయడం ద్వారా పండించిన పంటను సకాలంలో విక్రయించుకోవడంతో పాటు ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంట నష్టం పొందే వీలుంటుందని వెల్లడించారు. ఈ క్రాప్ నమోదైన రైతుల వివరాలు గ్రామ సచివాలయ నోటీసు బోర్డులో ఉంచడం జరిగిందని, ఎవరైన నమోదు కాకుంటే రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎస్‌కేఎస్ ప్రసాద్, వీఏఏ వి.సాయికుమార్ పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే మహాభాగ్యం

ప్రజారోగ్యమే మహాభాగ్యంగా భావిస్తున్న రాష్ట్రంలోని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా పలుచోట్ల వైద్య శిబిరాలు గురువారం నిర్వహించింది. ఆయా శిబిరాల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు మాట్లాడుతూ ప్రజల చెంతకే వైద్య సేవలు చేర్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఇదిలా ఉండగా శిబిరాలకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. అవసరమైన వారికి వైద్య సిబ్బంది మందులు అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్



సంతకవిటి: బొద్దూరులో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు, జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.జగన్‌మోహన్‌రావు, సర్పంచ్ జి.బాబూరావు



రాజాం : సోపేరులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో తనిఖీలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేత డాక్టర్ తలే రాజేష్



బాడంగి: మండల కేంద్రంలో వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



రేగిడి : సరసనాపల్లిలో మెడికల్ కిట్లు అందజేస్తున్న వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు



బొబ్బిలి: పిరిడిలో వృద్ధుడికి కళ్లద్దాలు పెడుతున్న తహసీల్దార్ డోల రాజేశ్వరరావు, ఈజీపీఆర్‌డీ అల్లు భాస్కరరావు, తదితరులు

గ్రామ సభల ద్వారా ఉపాధి పనులు గుర్తించాలి



గ్రామ సభ నిర్వహిస్తున్న ఏపీఓ హరనాథరావు

రేగిడి : గ్రామ సభల ద్వారా ఉపాధి పనులు గుర్తించాలని ఉపాధి పథకం ఏపీఓ ఎస్.హరనాథరావు సిబ్బందికి సూచించారు. మండల పరిధిలో వావిలవలస గ్రామంలో ఉపాధి పనులు గుర్తింపుపై గ్రామ సభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 – 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి పనులు గుర్తింపు జరుగుతుందని, రైతులు తమకు అవసరమైన పనులు గ్రామ సభ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇప్పటికే ఈ గ్రామంలో రూ.1.19 కోట్లు అంచనాలతో పనులు గుర్తించామని అన్నారు. సభలో పంచాయతీ సర్పంచ్ మొయిద ప్రసాదరావు, పంచాయతీ కార్యదర్శి ప్రసన్న, టెక్నికల్ అసిస్టెంట్ రాంబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ భవానీ తదితరులు పాల్గొన్నారు.

కొండచిలువ హతం



గ్రామస్తుల చేతిలో హతమైన కొండచిలువ

సంతకవిటి: మండల పరిధిలోని రంగారాయపురం గ్రామస్తులు కొండచిలువను గురువారం హతమార్చారు. రైతులు పొలాల్లో పనులు చేసే సమయంలో వరి పొలం నుంచి ఒక్కసారిగా బయటకు రావడంతో భయభ్రాంతులకు గురై కొండచిలువను హతమార్చారు. సుమారు 10 అడుగుల పొడవు వుంది.

రైతులకు పరిహారం ఇవ్వాలి..



మాట్లాడుతున్న మర్రాపు సూర్యనారాయణ

బొబ్బిలి: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావం వల్ల పంటలు కోల్పోయిన రైతులకు పరిహారం మంజూరు చేయాలని రైతు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. పట్టణంలోని గంటి ప్రసాదం స్మారక భవనంలో రైతు సంఘ కార్యవర్గ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నదుల అనుసంధానం, రైతుల పంట ఉత్పత్తులు, విక్రయాలు వంటి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.గోపాలం, బి. రాంబాబు పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు

తెర్లాం: ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని తెర్లాం 1, 2 గ్రామ సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్ శ్రీరామ్ అన్నారు. ఇళ్ల నిర్మాణ పనులు మధ్యలో వదిలేసిన లబ్ధిదారులకు గురువారం నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లబ్ధిదారులందరూ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ త్రినాథరావు

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఎంఈఓ జె. త్రినాథరావు అన్నారు. మండలంలోని వి.చిన్నయ్యపేట ప్రాథమిక పాఠశాలను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. అలాగే పాఠశాలకు సంబంధించిన రికార్డులు, విద్యార్థుల విద్యా ప్రమాణాలు, హోమ్ వర్క్ పుస్తకాలు, ఉపాధ్యాయులు లెస్సన్ ప్లానింగ్ డైరీలను తనిఖీ చేశారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ, విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా ఉపాధ్యాయులు బోధన చేపట్టాలని ఆయనతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

జాబ్‌మేళా రేపు

బొబ్బిలి: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ వద్ద శనివారం మహిళా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జీవీ రమణారావు, జిల్లా నైపుణ్యాధికారి నీలం గోవిందరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైవే టైర్స్ కంపెనీలో ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 99888 53335 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

జగనన్న పల్లెనిద్రపై సమీక్ష రేపు

వంగర: నవంబర్ 1వ తేదీ నుంచి నిర్వహించనున్న జగనన్న పల్లెనిద్ర కార్యక్రమంపై శనివారం సమీక్ష నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ హనుమంతు శశిభూషణరావు గురువారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం 2గంటలకు జరగనున్న ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

దుకాణాల్లో పరిశుభ్రత పాటించాలి



స్వీట్ షాపులో వివరాలు సేకరిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్

రాజాం : పట్టణంలోని స్వీట్స్, బేకరీ షాపులతో పాటు టీ షాపులు, టిఫిన్, భోజన హోటళ్లలో పరిశుభ్రత పాటించాలని రాజాం మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ వ్యాపారులకు సూచించారు. రాజాం ప్రధాన రహదారి పక్కనే ఉన్న పలు స్వీట్స్ షాపులతో పాటు భోజన హోటళ్లను గురువారం ఆయన పరిశీలించారు. యజమానులతో మాట్లాడారు. ప్రతీ షాపులో పరిశుభ్రత పాటించాలని, వినియోగించే సామగ్రి శుచిగా ఉండాలని అన్నారు. కాలం చెల్లిన పదార్థాలను జాగ్రత్తగా శానిటేషన్ తొట్టెల్లో వేయాలని, వీటిని విక్రయాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఒకరి అరెస్ట్

బొబ్బిలి: రామభద్రపురం మండలం కొండకెంగువ గ్రామానికి చెందిన పొగందొర వెంకటరమణ సారా తరలిస్తుండగా అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఈబీ సీఐ ఆర్. జైభీమ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన వద్ద నుంచి సారా సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. దాడుల్లో హెచ్‌సీ మాధవీదేవి, చంద్రప్రసాద్, ఆదినారాయణ, జయరాం, సరస్వతి, తదితరులు పాల్గొన్నారన్నారు.

అయోధ్యకు యువకుల పయనం



అయోధ్య పయనమైన యువకులకు కలశాలను అందిస్తున్న ఎంపీడీఓ శశిభూషణరావు

వంగర: మండలంలోని వివిధ గ్రామాల నుంచి యువకులు అయోధ్యకు పయనమయ్యారు. అయోధ్యలో రామాలయం నిర్మాణంలో భాగంగా మేరామట్టి – మేరా దేశ్ కార్యక్రమంలో అమృత కలశ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సేకరించిన మట్టి, బియ్యం, ధాన్యం కలశాలను అయోధ్యకు పంపిస్తున్నట్లు ఎంపీడీఓ హనుమంతు శశిభూషణరావు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ లోపింటి త్రినాథ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల్లో ఈ -క్రాప్ నమోదు జాబితా

రేగిడి: మండలంలోని 25 రైతు భరోసా కేంద్రాలలో రైతులు సాగు చేస్తున్న ఈ–క్రాప్ నమోదు జాబితాను ప్రదర్శించామని వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ రైతులకు సూచించారు. మండల పరిధిలోని చాటాయివలస, అంబకండి, సోమరాజుపేట తదితర గ్రామాల ఆర్‌బీకేల్లో ఈ–క్రాప్ నమోదు జాబితాను రైతులకు గురువారం చూపించారు. జాబితాల్లో రైతులకు అభ్యంతరాలు ఉంటే మూడు రోజుల్లోగా సరిచేసుకునేందుకు సమయం ఉందన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాదేవి అనుపోత్సవం



అమ్మవారి ఊరేగింపు

సంతకవిటి: మండల కేంద్రంలోని స్టార్‌బాయ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి అనుపు కార్యక్రమం గురువారం చేపట్టారు. దుర్గాదేవికి ఉదయం నుంచి విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు గురికాకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అనంతరం అమ్మవారిని వీధులలో ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ఊరేగింపు సమయంలో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

వివరాలు సరిచూసుకోవాలి..

తెర్లాం: మండలంలో జరిగిన ఈ – క్రాప్ నమోదులో పంటల నమోదు వివరాలు సరిగ్గా ఉన్నాయో, లేదో స్థానికంగా ఉన్న రైతుభరోసా కేంద్రాలకు వెళ్లి చూసుకోవాలని మండల వ్యవసాయ అధికారి జి.సునీల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 ఖరీఫ్ సీజన్ ఈ క్రాప్ నమోదుకు సంబంధించి సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 26 నుంచి 29 వరకు రైతుభరోసా కేంద్రాల్లో పంటల వివరాలకు సంబంధించిన జాబితాలను వేలాడదీయడం జరుగుతుందన్నారు. రైతులు వారికి సంబంధించిన పంటల వివరాలు ఆ జాబితాల్లో సక్రమంగా ఉన్నాయో, లేదో పరిశీలించుకోవాలని సూచించారు. ఎటువంటి తప్పులున్నా వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు.

జగనన్న సేవలు రాష్ట్రానికి అవసరం

● ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు



మాట్లాడుతున్న ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు

రామభద్రపురం: రాష్ట్ర ప్రజల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సేవలు అవసరమని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు అప్పికొండ లక్ష్మునాయుడుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమంతో అన్నివర్గాలకు అండగా నిలుస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆదరించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. విద్య, వైద్యం, సంక్షేమ రంగాల్లో చేపట్టిన విప్లవాత్మక మార్పులను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. చంద్రబాబు ప్రజల సొమ్మును దోచేసినా ఆయన్ను నిజాయితీపరుడిగా చిత్రీకరించడం సిగ్గుచేటన్నారు. అట్టడుగు వర్గాల ప్రజలు ఆర్థిక, సాంఘిక, సామాజిక, రాజకీయ రంగాల్లో రాణించేలా వైఎస్సార్‌సీపీ తీసుకున్న చర్యలను ప్రజలకు వివరించేందుకే సామాజిక సాధికార బస్సు యాత్రను ప్రారంభించినట్లు తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరవేయడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు డర్రు పైడిరాజు, పెద్దింటి కృష్ణమూర్తి, ముల్లు తిరుపతిరావు, శింగనపల్లి త్రినాథ, తదితరులు పాల్గొన్నారు.

శాంతి,భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

● సీఐ తిరుమలరావు



గ్రామస్తులతో మాట్లాడుతున్న బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు

తెర్లాం: గ్రామంలో శాంతి,భద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు అన్నారు. మండలంలోని సుందరాడ గ్రామాన్ని ఇన్‌చార్జ్ ఎస్సై బి.సురేంద్రనాయుడుతో కలిసి గురువారం ఆయన సందర్శించారు. గ్రామంలో ఇటీవల జరిగిన దేవీ విగ్రహం నిమజ్జనం సందర్భంగా రెండు కులాల మధ్య ఘర్షణ చోటుచేసుకోవడంతో కులదూషణ, పోక్సో కేసులు నమోదైన సంఘటన తెలిసిందే. ఈ మేరకు గ్రామంలో ఎటువంటి అల్లర్లు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామంలో పర్యటించి ప్రజలను చైతన్య పరిచారు. ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశామని.. రెండు కేసులపై దర్యాప్తు జరుపుతామని సీఐ తిరుమలరావు తెలిపారు. ఆయనతో పాటు ఏఎస్సై మల్లేశ్వరరావు, హెచ్‌సీ రాజు, తదితరులు ఉన్నారు.

ప్రారంభానికి సిద్ధమైన ట్రెజరీ భవనం



ప్రారంభానికి సిద్ధంగా ట్రెజరీ కార్యాలయం

రాజాం : రాజాంలోని శ్రీకాకుళం రోడ్డులో తహసీల్దార్ కార్యాలయం వద్ద నూతనంగా నిర్మించిన ట్రెజరీ కార్యాలయ భవనం ప్రారంభానికి సిద్ధమైంది. ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిధులతో ఈ భవనాన్ని నిర్మించారు. రూ.1.08 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణం చేపట్టినట్లు ఏఈ రాధాకృష్ణ వెల్లడించారు. పనులు పూర్తవడంతో త్వరలో ఈ భవనాన్ని ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ఏఈ తెలిపారు.

అన్నదాతకు అండగా ప్రభుత్వం



గ్రామసభలో మాట్లాడుతున్న ఏఓ వెంకటయ్య

రామభద్రపురం: వ్యవసాయ రంగంలో అనేక విప్లవాత్మకమైన మార్పులు తీసుకువస్తూ అన్నదాతకు అండగా ప్రభుత్వం నిలుస్తోందని ఏఓ వెంకటయ్య అన్నారు. గురువారం స్థానిక రైతుభరోసా కేంద్రం -2లో ఈ క్రాప్ సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ క్రాప్ చేపట్టిన రైతుల జాబితా ప్రదర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ నెల 26 నుంచి 29 వరకు మండలంలోని అన్ని రైతుభరోసా కేంద్రాల వద్ద ఈక్రాప్ జాబితాలు వేలాడదీస్తామన్నారు. ఏమైనా అభ్యంతరాలుంటే వీఏఏలకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ, వీహెచ్ఏ కొండలరావు, హైమ పాల్గొన్నారు.

29న ఉచిత క్యాన్సర్ వైద్యశిబిరం

బొబ్బిలి: మండలంలోని గొంగాడవలస గ్రామ సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 29న గ్రామంలోని మండల పరిషత్ పాఠశాల ఆవరణలో ఉచిత క్యాన్సర్ వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు పాల్గొనే ఈ శిబిరంలో 25 సంవత్సరాలు పైబడిన మహిళలకు క్యాన్సర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 95503 11249 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రుచిగా 'జగనన్న గోరుముద్ద'

రేగిడి : ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకం రుచిగా, శుచిగా ఉండాలని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు హెచ్‌ఎంలకు సూచించారు. ఉంగరాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను గురువారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా వంట నిర్వాహకులతో మాట్లాడుతూ విద్యార్థులకు క్రమం తప్పకుండా మెనూ అందించాలని అన్నారు. హెచ్‌ఎంలు నిత్యం పర్యవేక్షణ చేయాలని హెచ్‌ఎం వెంకటరమణకు సూచించారు. ప్రభుత్వం అందించిన స్కూల్ యూనిఫామ్‌లు విద్యార్థులు ధరించేలా చూడాలని, షూస్ వినియోగంలో ఉండేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఐఎస్ఎమ్ కోఆర్డినేటర్ కెంబూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తుడి మృతి



చిన్నంనాయుడు మృతదేహం

రామభద్రపురం: మండల కేంద్రంలోని గొర్లెవీధికి చెందిన అయ్యప్ప భక్తుడు గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.... గొర్లె చిన్నంనాయుడు (48) రెండు రోజుల కిందట అయ్యప్పస్వామి మాల ధరించాడు. స్థానిక ఐటీఐ కళాశాల ఆవరణలో ఓ గదిలో సన్నిధి ఏర్పాటు చేసుకుని అయ్యప్పస్వామి పూజలు చేసుకుంటున్నారు. గురువారం ఉదయం 11 గంటల సమయంలో ఆయన నిద్రలోనే కన్నుమూశారు. చిన్నంనాయుడు పార్వతీపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మృతుడికి భార్య చెంచులక్ష్మి, కుమార్తె ఉంది.

జాతీయ ఉపకార వేతనాలపై అవగాహన

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో జాతీయ ఉపకార వేతనాలపై విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. విశ్వవిద్యాలయ జాతీయ ఉపకార వేతనాల నోడల్ అధికారి డాక్టర్ సన్నీడియోల్ వేతనాలు పొందడానికి కావాల్సిన అర్హతలు, ఇతర వివరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఈ ఉపకార వేతనాలు ఎంతో ప్రయోజనకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ ఎంఎల్ఎస్ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.